ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 11-7-2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పురాతన దేవాలయాలకు తిరుమల తిరుపతి దేవస్థానం-టీటీడీ నిధులను కేటాయించి అభివృద్ధి చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కోరారు.
2. భారత్ లో అధికారిక భాష హిందీతో పాటు అన్ని ప్రాంతీయ భాషలు సుందరమైనవని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రాజ్ భాషా దక్షిణ సంవాద్ పేరుతో కేంద్ర అధికారిక భాషా విభాగం హైదరాబాద్ లో నేడు నిర్వహించిన స్వర్ణోత్సవ వేడుకల్లో కిషన్ రెడ్డి, రాజ్యసభ డిప్యూటీ స్పీకర్ హరివంశ్ పాల్గొన్నారు.
3. కాళేశ్వరం ప్రాజెక్టుపై నియమించిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి వివరాలు అందించడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు.
4. రాష్ట్రంలో నేడు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది

టీటీడీ-బండి సంజయ్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పురాతన దేవాలయాలను గుర్తించి తిరుమల తిరుపతి దేవస్థానం-టీటీడీ నిధులను కేటాయించి అభివృద్ధి చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కోరారు. కరీంనగర్‌లో భూమిపూజ చేసిన శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. అలాగే, ఇల్లందకుంట రామాలయం, కొండగట్టు అంజన్న ఆలయాలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. ఈ రోజు తన జన్మదినం సందర్భంగా బండి సంజయ్ కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీటీడీలో వెయ్యి మందికి పైగా ఇతర మతాలకు చెందిన వారు ఉద్యోగాలు చేస్తున్నారని తక్షణమే వారిని ఉద్యోగాల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఇదిలాఉండగా బండి సంజయ్ పుట్టినరోజు సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్, హోంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

(పీఎన్)

కిషన్ రెడ్డి-రాజ్ భాషా

భారత్ లో అధికారిక భాష హిందీతో పాటు అన్ని ప్రాంతీయ భాషలు సుందరమైనవని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. వికసిత్ భారత్ ను మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని, ఇందుకు ఏకైక మార్గం హిందీ భాష అని అన్నారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని అధికారిక భాషా విభాగం తన స్వర్ణోత్సవ వేడుకలను హైదరాబాద్‌లో జరుపుకుంటోంది. రాజ్ భాషా దక్షిణ సంవాద్ పేరుతో గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో ఈ ఉదయం జరిగిన కార్యక్రమానికి కిషన్ రెడ్డి తో పాటు

రాజ్యసభ డిప్యూటీ స్పీకర్ హరివంశ్, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి పలు పుస్తకాలను ఆవిష్కరించారు. వాటిలో బెంగళూరుకు చెందిన BEML రాజ్‌భాషపై రూపొందించిన కాఫీ టేబుల్ బుక్, ONGC బెంగళూరు ప్రచురించిన పుస్తకం, తమిళనాడు కేంద్ర విద్యాలయం తయారుచేసిన తిరుకోయిల్ పై హిందీ పుస్తకం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సైబర్ క్రైమ్ భద్రతపై తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో కార్టూన్ పాత్రలతో రూపొందించిన పుస్తకం వంటివి ఉన్నాయి.

(Suresh Dharmapuri)

కాళేశ్వరం - హరీశ్ రావు

కాళేశ్వరం ప్రాజెక్టుపై నియమించిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి వివరాలు అందించకుండా కమిషన్ ను తప్పుదోవ పట్టిస్తోందన్న అనుమానం తమ పార్టీకి ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఈ రోజు కమిషన్ విచారణకు హాజరైన ఆయన ప్రాజెక్టుకు సంబంధించిన అదనపు సమాచారాన్ని కమిషన్‌కు అందజేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి గత ప్రభుత్వం మంత్రి మండలి ఆరుసార్లు తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన పత్రాలు, శాసనసభ మూడుసార్లు ఇచ్చిన ఆమోద వివరాలను కమిషన్‌కు సమర్పించినట్టు తెలిపారు. కాళేశ్వరంపై ఇంకా కీలక వివరాలు ఉన్నప్పటికీ, ప్రభుత్వం వాటిని తమకు ఇవ్వడం లేదన్నారు. కమిషన్‌కు కూడా ప్రభుత్వం పూర్తిస్థాయి సమాచారం అందించడం లేదన్న అనుమానాలున్నాయని చెప్పారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున త్వరలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తాత్కాలిక నీటి వినియోగం, నీటి పంపకాల మధ్య తేడా తెలియడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. ఇటీవల ప్రభుత్వం నీటి పంపకాలపై ఇచ్చిన ప్రజంటేషన్‌లో ముఖ్యమంత్రి అబద్ధాలు చెప్పారని ఆరోపించారు.

(డెస్క్)

క్యాబినెట్

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి ఆర్డినెన్స్‌ను జారీ చేయాలని ప్రభుత్వం తీర్మానించింది. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు జరిగిన 18 మంత్రివర్గ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలును సమీక్షించింది. 23 ప్రధాన శాఖలకు సంబంధించి 327 అంశాలపై నిర్ణయాలు తీసుకోగా, వాటిలో 321 నిర్ణయాలు అమలు జరగగా.. మిగిలిన ఆరు అంశాలపై మంత్రిమండలి వివరణ ఇచ్చింది.చివరి దశలో అసంపూర్తిగా ఉన్న నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని నిర్ణయించింది.

(డెస్క్)

జనాభా నియంత్రణ వనపర్తి

జనాభా నియంత్రణ పాటించాలని వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ యాదయ్య ప్రజలకు సూచించారు. పిల్లల మధ్య కనీసం మూడేళ్ల అంతరం ఉండాలని ఆయన కోరారు. ఈరోజు జాతీయ జనాభా దినోత్సవం సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నర్సింగ్ విద్యార్థులు, ఆశా వర్కర్లతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

(బైట్ అదనపు కలెక్టర్ యాదయ్య)

(పీటీసీ, వనపర్తి)

**BREAK**

కొమురవెల్లి-హుండి

సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ హుండీలను లెక్కించగా ఒక కోటి 4 లక్షల 35 వేల 711 రూపాయల నగదు సమకూరినట్లు ఆలయ ఈవో అన్నపూర్ణ తెలిపారు. 120 గ్రాముల బంగారం, 6 కిలోల 100 గ్రాముల మిశ్రమ వెండి, 16 క్వింటాళ్ల బియ్యం, 42 విదేశీ కరెన్సీ నోట్లు కూడా లభించినట్టు వెల్లడించారు.

(పీటీసీ, సిద్దిపేట)

సిరిసిల్ల-కిసాన్ సమ్మాన్ నిధి- బైట్

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా అందుతున్న నిధులు తమకు పంట పెట్టుబడులకు బాగా ఉపయోగపడుతున్నాయని రాజన్న సిరిసిల్ల జిల్లా, చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామానికి చెందిన లబ్ధిదారు ఎగుమామిడి రాంరెడ్డి ఆకాశవాణికి తెలిపారు.

(బైట్ రాంరెడ్డి)

(పీటీసీ, సిరిసిల్ల)

సంగారెడ్డి-ఆయిల్ ఫామ్

పంట మార్పిడిని ప్రోత్సహించడంలో భాగంగా సంగారెడ్డి జిల్లాలో ఆయిల్ పామ్ సాగు చేయాలని కలెక్టర్ పి. ప్రావీణ్య రైతులకు సూచించారు. ఆయిల్ పామ్ సాగుకు జిల్లా వాతావరణం అనుకూలంగా ఉందని తెలిపారు.

(పీటీసీ సంగారెడ్డి)

ఆసిఫాబాద్ - ఐటీడీఏ పీవో

ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం లింబుగూడలో ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ -PM JANMAN పథకం కింద నిర్మించిన బహుళార్థక సాధక కేంద్రాన్ని

ఐటీడీఏ పీవో కుష్బూ గుప్త, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి సందర్శించారు. ఈ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

(పీటీసీ, ఆసిఫాబాద్)

గ్రామ పాలన అధికారులు-సంగారెడ్డి

గ్రామ పాలన అధికారులు నియామకానికి భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం నుంచి నోటిఫికేషన్ జారీ అయినట్లు సంగారెడ్డి జిల్లా డిఆర్ఓ పద్మజ రాణి తెలిపారు. గతంలో వీఆర్వోలుగా, వీఆర్ఏలుగా పనిచేసి ఉన్నవారు ఈనెల 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

(PTC, SANGATEDDY)

వాతావరణం

రాష్ట్రంలో నేడు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ, హైదరాబాద్‌తో సహా పలు జిల్లాల్లో పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది.

(డెస్క్)

భద్రాచలం-ప్రమాద హెచ్చరిక

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 36 అడుగులకు పెరిగింది. సుమారు 6 లక్షల 15 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గోదావరి

నీటిమట్టం 43 అడుగులకు చేరితే అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు.
(PTC- B.KGM)

ప్రాణహిత వరద

ఆసిఫాబాద్ జిల్లాలో కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువన నుంచి వస్తున్న వరద కారణంగా ప్రాణహిత, పెన్ గంగ నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి అడ ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తి 3,800 క్యూసెక్కుల నీటిని కిందికి వదలడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో పాటు వందల ఎకరాల పంట నష్టపోయింది. ఇదిలా వుండగా, చింతలమానపల్లి మండలం, కేతిని గ్రామానికి చెందిన సుమన్ అనే యువకుడు వాగు దాటుతుండగా వరద ప్రవాహంలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. అతని కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

(పీటీసీ, ఆసిఫాబాద్)

ఆసిఫాబాద్-అదనపు కలెక్టర్

విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంచడానికి కృత్రిమ మేథ-AI ఎంతో ఉపయోగపడుతుందని ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. వాంకిడి మండలం బెండారలోని పాఠశాలను సందర్శించిన ఆయన, AI ద్వారా ఎలా బోధన చేయవచ్చో స్వయంగా చేసి చూపించారు.

(పీటీసీ, ఆసిఫాబాద్)

యాదాద్రి-పించన్లు

యాదాద్రి భువనగిరి జిల్లాలో చేయూత పింఛన్ల పంపిణీలో పారదర్శకత పాటించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. నిన్న రాత్రి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో

మాట్లాడుతూ... పింఛన్ల అమలులో తలెత్తే సాంకేతిక సమస్యలు లేదా పోర్టల్ అడ్డంకులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.
(పీటీసీ, యాదాద్రి)

వరంగల్-మేయర్
వరంగల్ నగరంలో ఉన్న అనధికారిక లే అవుట్‌లను గుర్తించి తొలగించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. ప్రజలు ఇలాంటి లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయకుండా అవగాహన కల్పించాలని టౌన్ ప్లానింగ్ విభాగానికి సూచించారు.

(పీటీసీ, వరంగల్)

కాజీపేట-ఆర్వోబీ
కాజీపేట ఆర్ఓబి నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. కాజిపేట ఫాతిమా నగర్ సమీపంలో కొనసాగుతున్న ఆర్ఓబి నిర్మాణ పనుల పురోగతిని అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఈరోజు పరిశీలించారు.

(వరంగల్ జిల్లా పీటీసి)

జోగులాంబ గద్వాల –ముద్ర రుణాలు

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ లో ఆరో వార్డు నందు మెప్మా ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు, మహిళ సంఘాలకు, ముద్ర రుణాలపై అవగాహన కల్పించారు. ఐదు మంది గ్రూపుగా ఏర్పడి మూడు లక్షల వరకు రుణం తీసుకోవచ్చని తెలిపారు. ఆర్పీలు సుంకన్న, బాలరాజు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

(జోగులాంబ గద్వాల జిల్లా, పిటిసి)